AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

అర్హులందరికీ రేషన్ కార్డులు

2

ముఖం చాటేసిన వరుణుడు

2

మాధవనగర్‌లో మొరాయించిన రైల్వేగేట్

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: నగర శివారులోని మాధవనగర్ వద్ద రైల్వేగేట్ మొరాయించింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. రైల్వే గేట్ వద్ద ఎప్పటిలాగే ఉదయం రైలు వెళ్లే సమయంలో గేట్‌మన్ గేట్ వేశాడు. అయితే బైపాస్ వైపు గేట్ పూర్తిగా పడకపోవడంతో కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది. చివరకు పూర్తిగా గేట్ పడకపోయినా రైళ్ల రాకపోకలు కొనసాగాయి. రైలు వెళ్లిన అనంతరం వాహనదారులు సైతం కొద్దిగా తెరిచి ఉంచిన గేట్ గుండానే రాకపోకలు సాగించారు. అనంతరం రైల్వేసిబ్బంది మరమ్మతులు చేశారు.

18-7-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

శ్రీరాంసాగర్‌లోకి స్వల్ప ఇన్‌ఫ్లో

అక్షరటుడే, ఆర్మూర్: వర్షాకాలం సీజన్ మొదలై నెల రోజులు దాటిపోయిన శ్రీరాంసాగర్‌కు అంతంత మాత్రంగానే ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 608 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఆవిరి రూపంలో 277 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా శుక్రవారం ఉదయానికి 1068.5 అడుగుల (20.9టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్ట్‌లో 14.356 టీఎంసీల నీరు ఉంది. వర్షాలు లేకపోవడంతో ఈ ఏడాది శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి అంతగా వరద రాలేదు. బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తినప్పటికీ అక్కడ కూడా వర్షాలు లేకపోవడంతో వరద రావడం లేదు. స్థానికంగా కురిసిన వర్షాలకు తోడు ఈ నెల 1 బాబ్లీ ఎత్తిన సందర్భంగా మొదట్లో 6 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఆదివారం 3,653 క్యూసెక్యులు, సోమవారం 2,172 క్యూసెక్యులు రాగా మంగళవారం నుంచి 600 క్యూసెక్కులకు తగ్గిపోయింది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంది.

'నాగమడుగు'కు భూసేకరణపై సమావేశం

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

అక్షరటుడే, నిజాంసాగర్: మండలంలో నిర్మిస్తున్న నాగమడుగు ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ నిర్మాణం కోసం భూసేకరణ కొనసాగుతోందని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. పైప్ లైన్ నిర్మాణం కోసం కావాల్సిన భూసేకరణకు సంబంధించి శుక్రవారం నిజాంసాగర్ మండల పరిషత్ కార్యాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాగమడుగు పైప్‌లైన్ నిర్మాణ పనుల కోసం మండలంలోని వడ్డేపల్లి శివారులో 2.14 గుంటలు, జక్కాపూర్ గ్రామ శివారులో 28 గుంటల భూమి అవసరం ఉందని సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకోసం రైతుల నుంచి ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు ఎకరాకు రూ.17లక్షలు గతంలో చెల్లించారని ప్రస్తుతం మార్కెట్‌కు అనుగుణంగా ధరను పెంచాలని రైతులు సబ్‌కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ భిక్షపతి, సర్వేయర్ శ్రీకాంత్, ఆర్ఐ సాయిలు, రైతులు సుభాష్ రెడ్డి, రవీందర్, పండరి పాల్గొన్నారు.

ఆగని వసూళ్లు..

▸ రిజిస్ట్రేషన్ల శాఖపై ఏసీబీ నిఘా ▸ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్కో దరఖాస్తుకు రేటు ▸ అవినీతి అధికారుల చిట్టాపై ఆరా తీస్తున్న అనిశా

రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై దాడులు కలకలం రేపాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో యథేచ్ఛగా అవినీతి సాగుతుండడంతో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. బీబీనగర్, సదాశివపేట్, జడ్చర్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో అధికారులు ఆకస్మికంగా సోదాలు చేశారు. ఈ సందర్భంగా భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోనూ వసూళ్ల దందా సాగుతుండడంపై ఏసీబీ నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. - అక్షరటుడే, నిజామాబాద్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. రెండు జిల్లాలకు కలిపి డీఆర్ (డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్) ఉన్నారు. అలాగే డీఐజీ కార్యాలయం కూడా నిజామాబాద్ జిల్లాలోనే ఉంది. అయినప్పటికీ పర్యవేక్షణ కొరవడింది. ఒకవిధంగా పలువురు సబ్ రిజిస్ట్రార్‌లు తాము దొడ్డిదారిలో వసూలు చేస్తున్న దాంట్లో నుంచి ఉన్నతాధికారులకు ముడుపులు ముట్టజెబుతున్నట్లు ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ కారణంగానే రిజిస్ట్రేషన్ల శాఖలో ఎన్నిమార్పులు తీసుకు వచ్చినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరగడం లేదు.

ఒక్కో దస్తావేజుకు ఒక్కో రేటు..

ప్రస్తుతం అన్ని కార్యాలయాల్లో ఆన్‌లైన్ స్లాట్ విధానం ఉంది. కానీ ఇప్పటికీ డాక్యుమెంట్ రైటర్ల ద్వారానే దస్తావేజులు పూర్తి చేసుకోవాల్సి వస్తోంది. దరఖాస్తుదారులకు సరైన అవగాహన లేకపోవడం ఓ కారణం అయినప్పటికీ.. ఈ సాకుతో సబ్‌రిజిస్ట్రార్‌లే డాక్యుమెంట్ రైటర్లను పెంచి పోషిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఒక్కో డాక్యుమెంట్‌కు ధరను ఫిక్స్ చేసి మరీ రోజువారీ వసూళ్లు చేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ప్రస్తుతం ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే రూ.3వేలు, ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ కోసం రూ.5వేలు చొప్పున డాక్యుమెంట్ రైటర్‌కు చెల్లించాల్సి వస్తోంది. ఇందులో నుంచి రైటర్లు, సబ్ రిజిస్ట్రార్‌లు వాటాలు పంచుకుంటున్నారు.

ఏసీబీ నజర్

ఏసీబీ అధికారులు మూడు జిల్లాలతోనే సరిపెట్టకుండా రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోనూ సోదాలు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి అధికారుల చిట్టాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

'ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడ్తారా..?'

అక్షరటుడే, ఇందూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఎన్నారై సెల్‌పై ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి నిలదీశారన్నారు. ఇచ్చిన హామీని ప్రశ్నించినందుకే వేల్పూర్ ఘటన చోటుచేసుకుందన్నారు. ఒక ఎమ్మెల్యే ఇంటికి కాంగ్రెస్ నాయకుడు అక్రమంగా ప్రవేశించడమే కాకుండా వీడియోలు తీయడం సమంజసం కాదన్నారు. ఆయనను వదిలేసి తమ కార్యకర్తలపై కేసులు వేయడం సిగ్గుచేటన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యే ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన వ్యక్తిని సెల్ఫ్ ప్రొటెక్షన్‌లో భాగంగానే తరిమికొట్టామని బాజిరెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఫ్రెండ్లీ పోలీసులు లేరని.. ఎనిమీ పోలీసులుగా తయారయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లతో పోలీసులు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారన్నారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా.. ఎంతమంది అరెస్ట్ చేసినా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. రెండు జాతీయ పార్టీలు అభివృద్ధిపై కాకుండా నాయకుల అభివృద్ధి కోసం పాటుపడుతున్నాయని విమర్శించారు. సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ విఠల్, బాజిరెడ్డి జగన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి

అమృత్ స్కీం పనుల ఆకస్మిక తనిఖీ

పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

అక్షరటుడే, కామారెడ్డి: పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం తనిఖీ చేశారు. అమృత్ పథకంలో భాగంగా నిర్మాణం చేపడుతున్న పైప్‌లైన్ పనులు, కళాభారతి ఆడిటోరియం పనులను సంబంధిత పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, మున్సిపల్ కమిషనర్, మెగా సంస్థ వారితో కలిసి పర్యవేక్షించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు నీటిలైన్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కొత్త బస్టాండ్ వద్ద డ్రెయినేజీ పూడికతీత కార్యక్రమాన్ని పరిశీలించారు. పూడిక నుండి తీసిన వ్యర్థాన్ని వెంటనే అక్కడి నుండి తొలగించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. సిబ్బంది హాజరు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఆయన వెంట డీఈవో రాజు, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి తదితరులున్నారు.

నిజాంసాగర్ కెనాల్ దిగువకు సాగునీరు అందించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

అక్షరటుడే, ఇందూరు: ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా అన్నదాతలు సాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పేర్కొన్నారు. నిజాంసాగర్ కెనాల్ దిగువ ప్రాంతాలకు సాగునీరు అందించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో తగినంత వర్షపాతం లేకపోవడం, నిజాంసాగర్ కెనాల్ నుంచి సాగునీరు విడుదల చేయకపోవడం వల్ల వరి పంట ఎండిపోతోందన్నారు. దీంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారన్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీల రూపంలో పెట్టిన పెట్టుబడులు వృథా అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితిలో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం గాఢనిద్రలో ఉందన్నారు. రైతుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. వినతిపత్రం అందించిన వారిలో పార్టీ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, రూరల్ కో-కన్వీనర్ పద్మా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు నాగోల్ల లక్ష్మీనారాయణ, నాయకులు మాస్టర్ శంకర్, పంచ రెడ్డి శ్రీధర్, ప్రమోద్, జగన్ రెడ్డి, నారాయణ యాదవ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత

అక్షరటుడే, ఇందూరు: సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా నాణ్యమైన విద్యను అందిస్తే భవిష్యత్తులో విద్యార్థులు మంచి ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. బోధనా సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూరుస్తూ.. అవసరమైన సిబ్బంది నియమించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాలిటెక్నిక్ కళాశాల ఫలితాలు, అధ్యాపకుల ఖాళీలు, అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సమీక్షించారు. విద్యార్థులతో మాట్లాడి శిక్షణ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డి ఉన్నారు.

పెద్దపులి కాదది.. చిరుతే..

అక్షరటుడే, కామారెడ్డి: రామారెడ్డి మండలం గోకుల్ తండాలో పెద్దపులి సంచారం వార్తలపై అటవీశాఖ అధికారులు స్పందించారు. ఆవుపై దాడి చేసింది పెద్దపులి కాదని.. చిరుత అని తేల్చారు. ఈ మేరకు ఆవు కోసం తిరిగి వచ్చి ట్రాక్ కెమెరా కు చిక్కిన ఫొటోలు మీడియాకు విడుదల చేశారు. అలాగే దాడి చేసింది ఆవుపై కాదని లేగ దూడపై అని వివరించారు. శుక్రవారం లేగ దూడకు పోస్టుమార్టం నిర్వహించిన అధికారులు వైకుంఠ దామం పక్కనే దహనం చేశారు. తండాకు చెందిన బాదావత్ పుల్యా అనే రైతు ఎప్పటిలాగే తన ఆవుల మందను తండాలో ఉన్న వైకుంఠదామం పక్కనే ఉంచాడు. గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో చిరుత ఆవుల మందపై దాడిచేసి లేగ దూడను చంపేసింది. ఆవుల మంద వద్దనే ఉన్న బాధిత కుటుంబ సభ్యులు గట్టిగా అరవడంతో లేగదూడను తినకుండానే పారిపోయింది. వెంటనే ఈ విషయాన్ని కుటుంబసభ్యులు అధికారులకు తెలపడంతో అధికారులు వచ్చి ఆవుల మందను ఇతర చోటకు తరలించి లేగ దూడను అక్కడే ఉంచి ట్రాక్ కెమెరాలను అమర్చారు.

రాత్రి మరోసారి..

చిరుత రాత్రి మరోసారి వచ్చి చంపిన లేగ దూడను లాక్కెళ్లి తినేసి.. కళేబరాన్ని వైకుంఠ దామానికి కొద్దిదూరంలో వదిలేసి వెళ్లిపోయింది. ఉదయం ఫారెస్ట్ అధికారులు ట్రాక్ కెమెరా చెక్ చేయగా దూడను లాక్కెళ్తున్న దృశ్యాలు కెమెరాలో రికార్డయ్యాయి. దీంతో లేగ దూడపై దాడి చేసింది పెద్దపులి కాదని, చిరుత అని అధికారులు నిర్ధారించుకున్నారు.

జాడ కోసం 26 ట్రాక్ కెమెరాలు

మరోవైపు పెద్దపులి జాడ కోసం అటవీ అధికారులు వారం రోజులుగా అడవిని జల్లెడ పడుతున్నారు. నాలుగు బృందాలు పులి కోసం అన్వేషిస్తున్నారు. పులి జాడ కోసం ఇప్పటి వరకు 26 ట్రాక్ కెమెరాలు అమర్చినట్టు అధికారులు తెలిపారు.

మాట్లాడుతున్న సీపీ సాయి చైతన్య

క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే త్వరగా కోలుకోవచ్చు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: క్యాన్సర్ వ్యాధి లక్షణాలను ముందే గుర్తించగలిగితే త్వరగా కోలుకోవచ్చని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగర శివారులోని ఇందూర్ క్యాన్సర్ ఆస్పత్రిలో శుక్రవారం క్యాన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్, యూఎస్ఏ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేస్తున్న వైద్యులు అనునిత్యం విద్యార్థిగానే భావిస్తే తమ వృత్తిలో మరింత పురోగతి సాధిస్తారని పేర్కొన్నారు.

క్యాన్సర్‌పై విస్తృత ప్రచారం జరగాలి

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం జరగాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. వ్యాధి ప్రారంభ దశలోనే సరైన టెస్టుల ద్వారా నిర్ధారించి వైద్యం తీసుకుంటే త్వరిత గతిన రికవరీ కావచ్చని ఆయన స్పష్టం చేశారు. ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రి నగరానికి దూరంగా ఉన్నప్పటికీ ఇక్కడి వైద్యులు రోగులకు చేస్తున్న సేవలను గుర్తించి ప్రజలు ఆస్పత్రికి దగ్గరవుతున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రతిమా రాజ్, శ్రీరామ్ అయ్యార్, వర్మ జంపన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అక్షరటుడే, బాన్సువాడ: నియోజకవర్గంలోని 66 మంది లబ్ధిదారులకు శుక్రవారం పట్టణంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తంగా రూ. 23,25,500 విలువైన చెక్కులను అందజేశామన్నారు. బాన్సువాడలో 15 మంది లబ్ధిదారులకు రూ.9.42 లక్షలు, బీర్కూర్ మండలంలో ఇద్దరికి రూ.45,000, నస్రుల్లాబాద్ మండలంలో 8 మందికి రూ.2.47లక్షలు విడుదలయ్యాయని ఆయన పేర్కొన్నారు. అలాగే మోస్రా మండలంలో ఒకరికి రూ. 38 వేలు, చందూర్ మండలంలో ఐదుగురికి రూ. 1.67 లక్షలు, వర్ని మండలంలో ఆరుగురికి రూ.2,69,500, రుద్రూర్ మండలంలో ఒకరికి రూ.11 వేలు, కోటగిరి మండలంలో 9 మందికి రూ. 3,31,500, పోతంగల్ మండలంలో 8 మందికి రూ. 2.14 లక్షలు మంజూరయ్యాయని వివరించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందల్వాయి మండలంలో..

అక్షరటుడే, ఇందల్వాయి: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన జెల్లెల రంజిత్ అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. దీనికి సంబంధించి ఎంపీ ధర్మపురి అర్వింద్ చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. దీంతో బీజేపీ నాయకులు శుక్రవారం రంజిత్‌కు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు లోలం సత్యనారాయణ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ జెల్లెల, కొత్త జనార్దన్, బూత్ అధ్యక్షుడు సాంబారు రవి, నాయకులు వినోద్, లింబాద్రి, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

అక్షరటుడే, ఎల్లారెడ్డి: నియోజకవర్గంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామని ఎమ్మెల్యే మదన్మోహన్ రావు అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్, గాంధారి మండలాల్లో అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని, దీంతో పేదలు ఎంతో ఇబ్బందులు పడ్డారని.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోయారన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం సైతం వినియోగించుకోలేక పోయారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక, మొరం కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో పార్థ సింహారెడ్డి, డీఎస్‌వో మల్లికార్జున్, తహశీల్దార్ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాయిబాబా, ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత వెంకట రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లో ఫిజియోథెరపి శిబిరం

అక్షరటుడే నిజాంసాగర్: మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులకు ఇంట్లో చేసే వ్యాయామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ అరుణ్ కుమార్, ఎంఈవో తిరుపతి రెడ్డి, సునీల్, గైని చిన్న సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

అక్షరటుడే,లింగంపేట: మండల కేంద్రంలో పెద్దమ్మ ఆలయం నుంచి పోస్ట్ ఆఫీస్ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారా గౌడ్ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సహకారంతో లింగంపేట్‌లో రూ.కోటి వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు దశరథ్, మండల యువజన అధ్యక్షుడు రామకృష్ణాగౌడ్, ప్రసాద్ గౌడ్, ఎల్లమయ్య, వహబ్, కౌడ రవి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి జైలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేయగా.. 11 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వీరిని శుక్రవారం సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చగా 9 మందికి రూ.14,500 జరిమానా వేశారు. ఇద్దరికి ఒక్కోరోజు జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ట్రాఫిక్ ఏసీపీ తెలిపారు.

ఎన్నో ఆశలతో వానాకాలం పంటలు సాగు చేసిన రైతులపై వరుణుడు కనికరం చూపడం లేదు. ఈ ఏడాది వర్షా లు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. అందుకు తగ్గట్లుగానే రుతుపవనాలు కూడా ముందుగానే ప్రవేశించాయి. దీంతో అన్నదాతలు పంటలను సాగు చేశారు. తీరా పంటలు వేశాక వరుణుడు ముఖం చాటేడయంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గత పక్షం రోజులుగా వర్షా లు లేవు. దీంతో సాగు చేసిన పంటలు ఎండు ముఖం పడుతున్నాయి.

- అక్షరటుడే, కామారెడ్డి

వర్షా లు లేక మిట్టపల్లిలో నెర్రలు బారిన నేల

ముఖం చాటేసిన వరుణుడు

ఎండిపోతున్న మొక్కజొన్న పంట

■ పక్షం రోజులుగా పత్తా లేని వాన ■ ఎండుతున్న పంటలు ■ ఆందోళనలో రైతులు

పక్షం రోజులుగా ఉమ్మడి జిల్లాలో వర్షాలు పడడం లేదు. దీంతో రైతులు నిత్యం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు వరినాట్లు పూర్తి చేశారు. అయితే వర్షాలు లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో రైతులు నాట్లు వేయకుండా ఆగిపోయారు. బోరుబావుల ఆధారంగా పంటలు సాగు చేసిన రైతులు.. ప్రస్తుతం నీరు పారక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సీజన్‌లో భారీ వర్షాలు పడలేదు. చెరువులు నిండలేదు. వాగులు పారలేదు. దీంతో భూగర్భ జలాలు వృద్ధి చెందక.. పంటలకు నీరు అందడం లేదు. ముఖ్యంగా ఆరుతడి పంటలు ఎండు ముఖం పడుతున్నాయి. వరికి కూడా కొన్ని ప్రాంతాల్లో నీరు అందడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గిన వర్షపాతం

గత సంవత్సరం జిల్లాలో ఈపాటికి బాగానే వర్షాలు కురిశాయి. ఈ ఏడాది జూన్‌లో కూడా వర్షాలు పడ్డాయి. జులై ఆరంభం నుంచి వానలు ముఖం చాటేశాయి. మరోవైపు ఎండలు మండుతున్నాయి. దీంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేడికి పొలాల్లో నీరు ఉండడం లేదు. కామారెడ్డి జిల్లాలో ఈ ఏడాది జూన్‌లో 139.1 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 146.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జులైలో 131.1 మి.మీ.కు 73.5 మి.మీ వర్షమే కురిసింది. నిజామాబాద్ జిల్లాలో జూన్‌లో 154 మి.మీ.కు 62 మి.మీ వర్షపాతమే నమోదైంది. జులై 17 వరకు 196 మి.మీ. వర్షం పడాల్సి ఉండగా 60 మి.మీ. వర్షమే కురిసింది.

పంటల సాగు ఇలా..

కామారెడ్డి జిల్లాలో 2,96,237 ఎకరాల్లో పంటలు సాగు చేశారని వ్యవసాయ అధికారులు తెలిపారు. వరి 1.04 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 23, 214 ఎకరాలు, కందులు 23,214, పెసరు 2,723, మినుము 1,961, సోయాబీన్ 77,124, పత్తి 30,958, చెరుకు 879 ఎకరాల్లో సాగు చేశారు.
ఇక నిజామాబాద్ జిల్లాలో 5,18,969 ఎకరాల్లో పంట సాగు చేస్తారు. ఇందులో వరి 4.12 లక్షలు ఎకరాలు, సోయా 56,085, మొక్కజొన్న 37,633, కందులు 1,688, మినుము 265, వేరుశనగ 298, పత్తి 2,428, చెరుకు 776 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

వర్షా ల్లేక పంట ఎండిపోయింది..

ముందస్తుగా వర్షాలు పడడంతో రెండున్నరెకరాల్లో నాట్లు వేశాను. ఆ తర్వాత వర్షాల జాడ లేకుండా పోయింది. పెట్టుబడి అంతా పోయింది. పొలం ఎండిపోయింది. వానాకాలం చినుకు పడకపోతే రైతుల గతేం కావాలి. బోర్లల్లో నీళ్లు కూడా అందడం లేదు. మా పరిస్థితి ఏమిటో అర్థం కావట్లేదు.

– నౌసి, రైతు, సుద్దపల్లి

పంటలు ఎండిపోలేదు

జిల్లాలో 2.96 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో వర్షపాతం తక్కువగా నమోదైంది. ప్రస్తుతానికి జిల్లాలో ఎక్కడ కూడా పంటలు ఎండిపోయాయని సమాచారం లేదు. మరొక పది రోజులు ఉంటే పంటలు ఎండిపోయే అవకాశం ఉంది. – మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, కామారెడ్డి

మద్నూర్ ఎస్సైకి సన్మానం

అక్షరటుడే, నిజాంసాగర్: మద్నూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్ కొండ ఇటీవల కరీంనగర్‌లో జరిగిన 2వ జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోరెన్సిక్, ఫొటోగ్రఫీ ఫింగర్ ప్రింట్ సైన్స్‌లో వెండి పతకాలు సాధించారు. దీంతో ఆయనను శుక్రవారం బీఆర్ఎస్ మద్నూర్ మండల అధ్యక్షుడు బన్సీ పటేల్, ప్రధాన కార్యదర్శి గోవింద్ పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

అక్షరటుడే, బోధన్: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి శుక్రవారం మహా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రీయింబర్స్‌మెంట్ రూ.8వేల కోట్లు ఉన్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి, విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు విగ్నేష్, గౌతం కుమార్, మోసిన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

అక్షరటుడే, భీమ్‌గల్: ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ సూచించారు. మండలంలోని జాగిర్యాల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సందర్శించారు. ప్రతి శుక్రవారం గ్రామస్థాయి సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలన్నారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో జావిద్ అలీ, ఏపీవో నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి అర్చన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అక్షరటుడే, ఆర్మూర్ : పట్టణ ప్రజలు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 3, 17వ వార్డుల్లో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరుగుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, వీధి కుక్కలపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫ్రైడే డ్రై డేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, వార్డ్ ఆఫీసర్లు, ఆరోగ్యశాఖ సిబ్బంది, శానిటరీ జవాన్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

అక్షరటుడే, నిజాంసాగర్: బిచ్కుంద మున్సిపల్ పరిధిలోని కందర్‌పల్లిలో శుక్రవారం మహాలక్ష్మి మందిరం ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలు, రైతులపై ఉండాలని, పాడిపంటలతో, సుభిక్షంగా ఉంచాలని మొక్కుకున్నారు. ఆయన వెంట ఆలయ నిర్వాహకులు, భక్తులు, నాయకులు సొసైటీ వైస్ ఛైర్మన్ యాదరావు, గంగారాం, మారుతి, రాములు, బస్వరాజ్ పటేల్, ధరణి అశోక్ పటేల్, కల్లాలి మాజీ సర్పంచ్ సంజు పటేల్, రాజు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కమ్యూనిటీ భవనానికి నిధులివ్వాలి

అక్షరటుడే, ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామంలోని యాదవ సంఘం కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేయాలని సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో యాదవ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి నిధుల విడుదలకు హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ ఇందల్వాయి మండలాధ్యక్షుడు మోత్కూరి నవీన్ గౌడ్, యాదవ సంఘం అధ్యక్షుడు గొల్ల లింగం, యాదవ సంఘ మండల కార్యదర్శి బొట్టు శీను, రాంబాబు, జక్కుల లింబాద్రి, భోగం ప్రశాంత్, కాంట్రాక్టర్ మోతిలాల్, గంగారాం ఉన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

అక్షరటుడే, లింగంపేట: మండలకేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు బొల్లారం క్రాంతికుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానికంగా కేంద్రం లేకపోవడంతో తాడ్వాయి, ఎల్లారెడ్డికి వెళ్లాల్సి వస్తోందని వివరించారు. వెంటనే లింగంపేటలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మురళి, రాంచందర్, పెద్ది శివయ్య, ఎల్లేశం, శ్రీకాంత్, సుభాష్, అల్లూరి పాల్గొన్నారు.